

ఇదేమి ఆదర్శం!

మహేశ్వరం మోడల్ స్కూల్‌లో స్కావెంజర్ల వేతనాల కోసం వచ్చే నిధుల్లో అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయి. 8లో▸



ప్రయాణికుల ముసుగులో..

ప్రయాణికుల ముసుగులో గుట్టుగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 8లో▸



కోడి పందేల స్థావరంపై..

కోడి పందేలు నిర్వహిస్తున్న స్థావరంపై పోలీసులు దాడి చేసి ఇద్దరు పందెం రాయుళ్లను రిమాండ్‌కు తరలించారు. 8లో▸

తెగుతున్న బంధాలు!

ఆందోళన కలిగిస్తున్న కుటుంబ హత్యలు

రోజురోజుకూ నేర ప్రవృత్తి పెరిగిపోతోంది.. మానవ సంబంధాలు మంటగలిసిపోతున్నాయి.. అనుమానాలు.. అక్రమ సంబంధాలు.. ఆస్తి తగాదాలతో అయినవారని కూడా చూడకుండా అంత మొందించడం ఆందోళన కలిగిస్తోంది.

- ఒకరినొకరు కడతేర్చుకుంటున్న వైనం
- అక్రమ సంబంధాలు, ఆస్తి గొడవలే కారణం
- అనాథలవుతున్న పిల్లలు
- ఆందోళన కలిగిస్తున్న ఘటనలు



కలిసి హత్య చేసి అక్కడి నుంచి పరారయ్యారు.

వికారాబాద్: అగ్ని సాక్షిగా ఏడడుగులు నడిచి మూడుముళ్ల బంధంతో ఒక్కటైన కొంతమంది ఒకరి పాలిట మరొకరు యమ పాశం విసురుకుంటున్నారు. ప్రియురాలి మోజులో భార్యను భర్త.. ప్రియుడి కోసం భర్తను భార్య.. ఆస్తిపై ఆశతో తండ్రిని కొడుకు కడతేర్చుతున్నారు. వావివరసలు మరచి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. వృద్ధాప్యంలో అండగా ఉండాల్సిన కొడుకులు, మనుమలు పండుటాకుల ప్రాణం తీస్తున్నారు. ఇటీవల ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని మోమిన్‌పేట, కోట్‌పల్లి, తాండూరు, వికారాబాద్, మొయినాబాద్ తదితర మండలాల్లో జరిగిన అమానవీయ ఘటనలు ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. పోలీసులు కేసులతో సరిపెడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. నైతిక విలువలు పెంపొందించే దిశగా చర్యలు తీసుకోవాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పోలీసు శాఖ ఆధ్వర్యంలో సామాజిక రుగ్మతలను రూపుమాపే దిశగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పలువురు సూచిస్తున్నారు.

మొదటి భర్తతో కలిసి ..

బిహార్ రాష్ట్రానికి చెందిన ఓ మహిళ మొదటి భర్తను వదిలేసి రెండో భర్తతో కలిసి తెలంగాణకు వచ్చింది. మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్ సమీపంలోని ఓ డెయిరీ ఫాంలో పనిచేసుకుంటున్నారు. ఇటీవల రెండోభర్తతో కూడా గొడవ పడింది. ఈ క్రమంలో మొదటి భర్తకు ఫోన్ చేసి ఇక్కడికి పిలిపించుకుంది. అతన్ని అంతమొందిస్తే మళ్లీ మనం కలిసి ఉండొచ్చని నమ్మబలికింది. ఇద్దరూ కలిసి హత్య చేసి అక్కడి నుంచి పరారయ్యారు.

సీన్ రివర్స్

ఒకప్పుడు వరకట్నపు వేధింపులు, వివాహేతర సంబంధాల కారణంగా భార్యను భర్త, అత్తింటి వారు కడతేర్చిన ఘటనలు చూశాం. ఇటీవల కాలంలో సీన్ రివర్స్ అయ్యిందనిపిస్తోంది. భార్యలే భర్తలను అంతమొందిస్తున్న ఘటనలు వెలుగుచేస్తున్నాయి. రెండు నెలల వ్యవధిలోనే ఇలాంటి ఘటనలు జిల్లాలో మూడు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది.

- రెండు నెలల క్రితం తాండూరు మండలం మల్కాపూర్‌లో భార్య భర్తను హత్య చేసింది. కూతురికి తండ్రి కూడా సహకరించాడు. ఇద్దరూ కటకటాలపాలయ్యారు. వారి ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారు.
- వారం రోజుల క్రితం ఇలాంటి ఘటనే మరొకటి చోటుచేసుకుంది. బంట్వారం మండలం కొంపల్లికి చెందిన దంపతులు మోమిన్‌పేట మండలం కేసారం గ్రామ శివారులోని ఓ ప్రైవేటు వెంచర్‌లో కూలి పనులు చేసుకుంటూ అక్కడే ఉంటున్నారు. గత ఆదివారం రాత్రి భర్తతో గొడవ పడి బండరాయితో తలపై మోది హతమార్చింది.
- తాజాగా రెండు రోజుల క్రితం ఇలాంటి ఘటనే వెలుగుచూసింది. కోట్‌పల్లి మండలం రాంపూర్‌కు చెందిన ఓ మహిళ భర్తతో తరచూ గొడవ పడేది. ఈ గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లిపోదామని పంచాయతీ పెట్టేది. భర్త ససేమిరా అనడంతో గత గురువారం రాత్రి పడుకున్న చోటే బండరాయితో తలపై మోది అంతమొందించింది. ఆమెకు ఎవరైనా సహకరించి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతో వారి ఇద్దరు కూతుళ్లు అనాథలయ్యారు.

భార్యను కడతేర్చి ముక్కలుగా నరికి..

వికారాబాద్ మండలం కామారెడ్డిగూడకు చెందిన డ్రైవింగ్ వృత్తిలో ఉన్న యువకుడు ఏడాది క్రితం అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. ఆరు నెలలు తిరగక ముందే వరకట్న వేధింపులకు పాల్పడుతూ వచ్చాడు. హైదరాబాద్ బోడుప్పల్‌లో నివాసముంటున్న అతను గర్భంతో ఉన్న భార్యను కనికరం లేకుండా అంతమొందించాడు. అంతటితో ఆగకుండా ముక్కలుగా నరికాడు. మొండెం నుంచి తల, శరీర భాగాలను వేరు చేసి మూసీలో పడేశాడు. 15 రోజుల క్రితం జరిగిన ఈ ఘటన రాష్ట్రంలో సంచలనం రేపింది.

విలువలు అవసరం



ఇటీవల జిల్లాలో చోటుచేసుకున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. రోజురోజుకూ విలువలు తగ్గిపోతున్నాయి. ఇలాంటి ఘటనలను అరికట్టాలంటే విలువలతో కూడిన సమాజ నిర్మాణం అవసరం. పాఠశాల స్థాయి నుంచే మంచి సమాజం కోసం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి.

– డాక్టర్ భాస్కరయోగి, రచయిత

11 గుంటల భూమి కోసం అన్నదమ్ముల కొట్లాట

ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలోని దండుమైలారంలో 11 గుంటల భూమి కోసం అన్నదమ్ముల మధ్య జరిగిన కొట్లాటలో ఒకరు ప్రాణాలు కోల్పోయిన ఘటన ఆగస్టు 31న చోటు చేసుకుంది.

❖ అదే ఆరాటం



మండల పరిధిలోని రావిచేడ్ ఆగ్రో రైతు సేవా కేంద్రానికి మంగళవారం 450 బ్యాగుల యూరియా వచ్చింది. విషయం తెలుసుకున్న వివిధ గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. టోకెన్లు పొందిన వారికి యూరియా పంపిణీ చేయగా, దక్కని వారు నిరాశతో వెనుదిరిగారు. – కడ్తాల్

యూరియా కోసం ఆందోళన వద్దు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి ఉష

యాచారం: యూరియా కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయాధికారి డి.ఉష అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికను మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నానో యూరియా వాడకంతో 8 శాతం అధికంగా పంట దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. రైతులకు ఆర్థిక భారం సైతం తగ్గిస్తుందన్నారు. యూరియా బస్తా రూ.266.50 ఉంటే, రూ.225కు లభించే అర లీటర్ నానో యూరియా ఎకరా పొలానికి సరిపోతుందని చెప్పారు. వరి, మొక్కజొన్న, పత్తి, జొన్న, కంది, పండ్ల, కూరగాయల పంటల్లో మంచి దిగుబడి వస్తుందన్నారు. రైతులు సాగు చేసిన పంటలను వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద నమోదు చేయించుకోవాలని సూచించారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి రవినాథ్, వివిధ గ్రామాలకు చెందిన విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రులపై నిఘా ఉంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేశ్వర్‌రావు

జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అనుమతుల్లేని ఆస్పత్రులపై మరింత కఠినంగా వ్యవహరించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు సంబంధిత వైద్యులకు ఆదేశాలు జారీ చేశారు. అడ్డగోలు చికిత్సలు చేస్తున్న ఆస్పత్రులు, వైద్యులపై గట్టి నిఘా ఉంచాల్సిందిగా సూచించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కార్యాలయంలో ఆయన సంబంధిత మెడికల్ ఆఫీసర్లతో సమావేశం అయ్యారు. తనిఖీల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వైద్యులు, ఇతర సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. విధి నిర్వహణలో మరింత కఠినంగా వ్యవహరించాల్సిందిగా కోరారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న స్వస్థనారీ స్వశక్తి పరివార్ అభియాన్ (అతివ ఆరోగ్యమస్తు) పేరుతో ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో డాక్టర్ విజయ పూర్ణిమ, డాక్టర్ గీత, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ నాగేంద్రబాబు, డాక్టర్ రాధిక, డాక్టర్ పూనం, డాక్టర్ రాకేష్, డెమో శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన నార్సింగి టీపీఓ

- చేవెళ్లలో చర్చనీయాంశం
- మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న మణిహారిక



చేవెళ్ల మున్సిపల్ కార్యాలయం

చేవెళ్ల: నార్సింగి మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారి రూ.4లక్షలు లంచం తీసుకుంటూ మంగళవారం ఏసీబీకి పట్టుబడినట్లు తెలియడంతో చేవెళ్లలో కలకలం రేగింది. నార్సింగిలో పట్టుబడిన మణిహారిక చేవెళ్ల మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ ఇన్‌చార్జిగా ఎనిమిది నెలల నుంచి కొనసాగుతున్నారు. దీంతో ఇక్కడ కూడా ఆమె వ్యవహారం ఎలా ఉందనే దానిపై స్థానికంగా చర్చించుకున్నారు. మున్సిపల్ పరిధిలో కొత్త నిర్మాణాలు, ఎల్ఆర్ఎస్ ప్లాట్ల విషయంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎల్ఆర్ఎస్ వ్యవహారం టౌన్‌ప్లానింగ్ అధికారులే చూడాల్సి ఉండడంతో ప్లాట్లు పరిశీలనకువస్తే వసూళ్లు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. మణిహారిక ఏసీబీకి పట్టుబడడంతో అధికారులు చేవెళ్ల మున్సిపాలిటీలో కూడా విచారణ చేస్తారన్న ప్రచారం జరిగింది. మంగళవారం మాత్రం కార్యాలయానికి ఎవరూ రాలేదు. కాగా ఎల్ఆర్ఎస్ సెకండ్ స్టేజీలో టౌన్‌ప్లానింగ్ అధికారి క్లియర్ చేయాల్సి ఉండగా ఆమె వద్ద ఫైల్స్ పెండింగ్‌లో ఉండటంతో దరఖాస్తుదారులు ఎదురు చూస్తున్నట్లు సమాచారం.

12న ఉద్యోగాల నియామకాలకు ఎంపిక

షాద్‌నగర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగాల నియామకాల కోసం ఎంపిక చేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమల మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్ఎస్ఎస్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో ఈనెల 12న ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బీఎస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసిన విద్యార్థులు లేదా మధ్యలో ఆపేసిన అభ్యర్థులు, డిప్లమా, ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. 2021 నుంచి 2025 వరకు ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. ఎంపికైనవారు జడ్చర్ల, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉన్న ఫార్మా పరిశ్రమల్లో ప్రొడక్షన్ డిపార్టుమెంట్‌లో పని చేయాల్సి ఉంటుందన్నారు. శిక్షణ సమయంలో నెలకు రూ.13వేల నుంచి రూ.16వేల వరకు స్టైఫండ్ చెల్లిస్తారని, శిక్షణ పూర్తయిన తర్వాత ఉద్యోగావకాశం కల్పించనున్నట్లు వివరించారు. వివరాలకు 94417 80553 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

లేఅవుట్‌లో అవకతవకలపై విచారణ



విచారణ జరుపుతున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు

కందుకూరు: ముచ్చర్లలోని ఫార్చ్యూన్ హోమ్స్ లేఅవుట్‌లో అవకతవకలపై మంగళవారం షెడ్యూల్ తెగల జాతీయ కమిషన్ ఢిల్లీలో విచారణ జరిపింది. వెంచర్ నిర్వాహకుడు రోసిరెడ్డి ఫార్చ్యూన్ హోమ్స్ పేరుతో ప్లాట్లను అమ్ముతామని చెప్పి మధ్యవర్తులు దేవీలాల్, పాండు ద్వారా షెడ్యూల్ తెగల వ్యక్తుల వద్ద డబ్బులు తీసుకుని అగ్రిమెంట్లు చేసి ఇచ్చిన తర్వాత రిజిస్ట్రేషన్ చేయకుండా వేధిస్తున్నారని బాధితులు జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై జాతీయ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్ కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజును పిలిపించి విచారణ జరిపారు. అవకతవకలు నిజమేనని వారు తెలిపారు. మరోసారి అన్ని విషయాలతో పూర్తిస్థాయి నివేదిక సమర్పించాలని, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కమిషన్ సభ్యుడు ఆదేశించినట్లు ఆర్డీఓ తెలిపారు.

పట్టణాభివృద్ధికి ఏకీకృత బిల్డింగ్ కోడ్

హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్




సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న యూనిఫైడ్ డెవలప్‌మెంట్ బిల్డింగ్ కోడ్(యూడీబీసీ) దేశవ్యాప్తంగా పట్టణాభివృద్ధి రంగానికి నమూనాగా నిలవనుందని హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ అన్నారు. సుస్థిరమైన పట్టణాభివృద్ధికి ఈ బిల్డింగ్ కోడ్ దోహదం చేస్తుందని చెప్పారు. యూడీబీసీపై హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ, ఎర్నెస్ట్ అండ్ యంగ్ (ఈవై) సంస్థలు మంగళవారం సంయుక్తంగా నిర్వహించిన భాగస్వామ్య సంస్థల సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పట్టణాభివృద్ధిలో ఏకీకృతమైన నియంత్రణ వ్యవస్థగా యూడీబీసీ పనిచేస్తుందని పేర్కొన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో సుస్థిరతను సాధించవచ్చన్నారు. డీటీసీపీ, ఇతర ప్రభుత్వ విభాగాలు, సంస్థలు ఈ కోడ్ రూపకల్పనలో భాగస్వాములు కావాలని కోరారు. బిల్డింగ్ కోడ్‌పై ఈవై సంస్థ జాతీయ, అంతర్జాతీయ నగరాలను సమగ్రంగా అధ్యయనం చేసి తెలంగాణ అభివృద్ధికి అవసరమైన కోడ్‌ను రూపొందిస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో క్రెడాయ్, నరెడ్కో, సీఐఐ తదితర సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. వివిధ సంస్థల నుంచి సేకరించిన సూచనలు, సలహాలు యూడీబీసీ ముసాయిదాను రూపొందించడంలో కీలకపాత్ర పోషించనున్నాయని నిర్వాహకులు తెలిపారు. సదస్సులో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, జలమండలి, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ అథారిటీ, పంచాయతీరాజ్ తదితర విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొని సలహాలు, సూచనలు అందజేశారు. ఇప్పటికే వివిధ విభాగాల్లో చేపట్టిన నిర్మాణాత్మక, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

సన్నగా బియ్యం.. తిన్నగా నల్లబజార్‌కు!

తీసుకోవడానికి లబ్ధిదారుల అనాసక్తి

- సొమ్ము చేసుకుంటున్న రేషన్ డీలర్లు
- కిలోకు రూ.12 చొప్పున కొనుగోలు
- పట్టని పౌరసరఫరాల శాఖ



సాక్షి, సిటీబ్యూరో: బియ్యం మారినా డీలర్ల తీరు మారలేదు. అదే చేతివాటం.. అదే తప్పుదారి.. సాక్షాత్తు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ప్రభుత్వ చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న 'ఉచిత సన్న బియ్యం' నగదు దందా బాహాటంగా కొనసాగుతోంది. ఆహార భద్రత (రేషన్) కార్డుదారులు సన్న బియ్యంపై కూడా అనాసక్తి కనబర్చడం డీలర్లకు కలిసివస్తోంది. కొందరు కార్డుదారులు ఈ–పాస్ యంత్రంపై బయోమెట్రిక్ (వేలిముద్ర) పెట్టి నెలవారీ బియ్యం కోటాను డీలర్లకు అప్పగించి నగదు పుచ్చుకోవడం, డీలర్లు కూడా కిలోకు రూ.12 చొప్పున లెక్క కట్టి నగదు అందించడం సర్వసాధారణమైంది.

సన్నబియ్యంపై కూడా..

పూట గడవని అత్యంత నిరుపేద కుటుంబాలు మినహా మిగతా కుటుంబాలు పీడీఎస్ బియ్యం వండుకొని తినడానికి పెద్దగా ఆసక్తి కనబర్చరు. మొన్నటి వరకు బియ్యం దొడ్డుగా, నాసిరకం, ముక్కి పోయి ఉండటం, వండి తిన్న తర్వాత జీర్ణం కాకపోవడం లాంటి కారణాలతో పెద్దగా ఆసక్తి కనబర్చేవారు కాదు. కొన్ని కుటుంబాలు మాత్రం రేషన్ బియ్యాన్ని కేవలం ఇడ్లీ, దోశలు, పిండి వంటలకు వినియోగిస్తున్నారు. ప్రతినెలా ఉచితంగా అందుతుండటం, అవసరానికి మించి వస్తుండటంతో డీలర్లకు అప్పగిస్తూ వచ్చేవారు. తాజాగా సన్నబియ్యం పంపిణీ జరుగుతున్నా లబ్ధిదారులను డీలర్లు తప్పుదోవ పట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఒక యూనిట్ బియ్యమే..

కొందరు కార్డుదారులు తమ నెలవారీ కోటాలో ఒక యూనిట్ బియ్యమే తీసుకొని మిగతా యూనిట్ల కోటాను డీలర్ల వద్ద నగదు రూపంలో బదిలీ చేసుకుంటున్నారు. వాస్తవంగా ప్రభుత్వ చౌకధరల దుకాణాల్లో ఈ–పాస్ (బయోమెట్రిక్) అమలు కంటే ముందు రేషన్ డీలర్లు చేతివాటం ప్రదర్శించి డ్రా చేయని లబ్ధిదారుల సబ్సిడీ సరుకులు గుట్టుచప్పుడు కాకుండా బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకునేవారు. సంస్కరణలో భాగంగా ఈ– పాస్ అమలుతో లబ్ధిదారుల బయోమెట్రిక్, ఐరిస్, ఓటీపీ తప్పనిసరి కావడంతో డీలర్లు లబ్ధిదారుల ప్రమేయంతో చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు.

అడ్డూ అదుపు లేకుండా దందా

పీడీఎస్ బియ్యం అక్రమ దందాకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. అడపాదడప విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసుల దాడుల్లో పీడీఎస్ బియ్యం క్వింటాళ్ల కొద్దీ పట్టుబడుతోంది. స్పెషల్ డ్రైవ్ సమయంలో బియ్యం వ్యాపారులు ఎక్కడి దొంగలు అక్కడే గప్‌చుప్‌గా.. మౌనం దాల్చుతున్నారు. ఆ తర్వాత తిరిగి దందాను కొనసాగించడం సర్వసాధారణంగా మారింది.

న్యూస్‌రీల్

ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన అధికారి సురేశ్

ఆమనగల్లు: ఆయిల్‌పాం సాగుతో రైతులు అధిక లాభాలు పొందొచ్చని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి సురేశ్ తెలిపారు. తలకొండపల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మంగళవారం ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయిల్‌పాం సాగు చేసే రైతులకు 90 శాతం సబ్సిడీపై డ్రిప్ అందిస్తున్నట్లు చెప్పారు. పంటసాగుకు అవసరమైన ఎరువుల కోసం ఎకరాకు రూ.4,200 చొప్పున నాలుగేళ్లపాటు మొత్తం రూ.16,800 చెల్లించడం జరుగుతుందని చెప్పారు. జిల్లాకు కేటాయించిన ఆయిల్ వ్యాల్యూ కంపెనీ ఒప్పందం మేరకు రైతులు సాగు చేసిన పంటను కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ ఏడీ కిషన్, షాద్‌నగర్ డివిజన్ అధికారి హిమబిందు, హెచ్ఈఓ సీతారాం, ఆయిల్ వ్యాల్యూ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ రామ్మోహన్‌రావ్, ఏరియా మేనేజర్ ప్రమోద్‌కుమార్, ఫీల్డ్‌ఆఫీసర్ కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి



లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న రిటైర్డు జడ్జి సాంబశివరావు

చేవెళ్ల: మద్యం తాగి వాహనాలు నడపకూడదని, దీంతో వారి ప్రాణాలతోపాటు ఎదుటి వారి ప్రాణాలకు ప్రమాదమని రిటైర్డు జడ్జి సాంబశివరావు అన్నారు. చేవెళ్ల కోర్టు ఆవరణలో మంగళవారం రెండో రోజు ట్రాఫిక్ పోలీస్ కేసుల లోక్ అదాలత్ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. పెండింగ్ కేసులను పరిష్కరించుకునేందుకు ఏర్పాటు చేసిన లోక అదాలత్ ఈనెల 13వ తేదీ వరకు కొనసాగుతుందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశం, ఏఎస్ఐ చందర్‌నాయక్, కానిస్టేబుళ్లు జంగయ్య, కవిత తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఉదయం 10 గంటలకు కొంగరకలాన్‌లోని కలెక్టరేట్‌లో ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులను ప్రదానం చేయనున్నట్లు జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు సహా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు కార్యక్రమానికి హాజరు కానున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 159 మంది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైనట్లు తెలిపారు.

సీపీ రాధాకృష్ణన్‌కు శుభాకాంక్షలు



రాధాకృష్ణన్‌కు వాక్ పుస్తకాన్ని అందజేస్తున్న అర్చకుడు రంగరాజన్ (ఫైల్)

మొయినాబాద్: భారత ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన సీపీ రాధాకృష్ణన్‌కు చిలుకూరు బాలాజీ దేవాలయం తరఫున అర్చకుడు రంగరాజన్ శుభాకాంక్షలు తెలియజేశారు. గత సంవత్సరం రాధాకృష్ణన్ చిలుకూరు ఆలయాన్ని దర్శించుకున్న సందర్భాన్ని గుర్తుచేశారు. మంగళవారం ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన అనంతరం మీడియా ద్వారా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. రాధాకృష్ణన్ ప్రజాసేవకు సమర్పించిన జీవితం, ధర్మం, నైతికత, భారతీయ సంస్కృతిని గుర్తుచేస్తూ ఆయన అంకిత భావం దేశానికి గర్వకారణం అన్నారు. భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తూ, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే దిశగా బాలాజీ ఆశీస్సులు ఎల్లప్పుడు ఆయనకు ఉండాలని స్వామివారిని ప్రార్థిస్తున్నామన్నారు.

ప్రయాణికుల ముసుగులో గంజాయి రవాణా



ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం అదుపులో నిందితులు

- ఒడిశా నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్ట్
- 21.33 కిలోల గంజాయి స్వాధీనం

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రయాణికుల ముసుగులో గుట్టుగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 21.33 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ అధికారులు తెలిపిన ప్రకారం.. మంగళవారం జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ఆధ్వర్యంలో విజయవాడ జాతీయ రహదారి అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా ఒడిశా రాష్ట్రానికి చెందిన ఆర్టీసీ బస్సులో తనిఖీ చేయగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారి బ్యాగులు, సూట్ కేసులు తనిఖీ చేయడంతో ప్యాకింగ్ చేసిన ఉన్న గంజాయి కవర్లు కనిపించాయి. దీంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ఒడిశా రాష్ట్రం జైపూర్‌కు చెందిన కుష్నూనాయక్ ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయి డెలివరీకి అదే రాష్ట్రానికి చెందిన బీరెన్‌నాయక్, రాజేంద్రశెట్టిని కొరియర్‌లుగా నియమించుకున్నాడు. ఈ క్రమంలో కుష్నూనాయక్ సూచన మేరకు సోమవారం రాత్రి బీరెన్‌నాయక్, రాజేంద్రశెట్టి గంజాయితో హైదరాబాద్‌కు బయలుదేరారు. మంగళవారం ఉదయం మార్గమధ్యలో అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద వాహనాలను తనిఖీచేస్తున్న జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం వీరిని గుర్తించి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణకు హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. కాగా అసలు సూత్రధారి కుష్నూనాయక్ ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా కొప్పు బాషా



యాచారం: గ్రామానికి చెందిన కొప్పు బాషా బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. నిరుపేద దళిత కుటుంబంలో పుట్టిన ఆయన 2000 సంవత్సరం నుంచి ఆర్‌ఎస్‌ఎస్, ఏబీవీపీ, బీజేవైఎంలలో కీలక పదవులు నిర్వర్తించారు. ఈ క్రమంలో తన సతీమణి సుకన్యను యాచారం ఎంపీపీగా పదవిలో కూర్చోబెట్టారు. అనంతరం బండి సంజయ్ రాష్ట్రాధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ కులాల్లోని ప్రజలకు ఎక్కడ అన్యాయం జరిగిన రాజీలేని పోరాటం చేశారు. ఆయన సేవలను గుర్తించిన పార్టీ అధిష్టానం తాజాగా పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమించింది. ఈ మేరకు మంగళవారం తన నివాసంలో పార్టీకి చెందిన పలువురు నేతలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొప్పు బాషా మాట్లాడుతూ... పార్టీ అధిష్టానం తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూ వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు శక్తి వంచన లేకుండా పనిచేస్తానన్నారు.

వ్యక్తి బలవన్మరణం



గోపాల్(ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఓ వ్యక్తి రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం పట్టణ శివారులోని కీర్తి వెంచర్ సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ మల్లేశ్వర్ తెలిపిన ప్రకారం.. ఫరూఖ్‌నగర్‌లోని వివేకానంద కాలనీకి చెందిన చాపల గోపాల్(39) ఓ పెట్రోల్ పంపులో పని చేస్తున్నాడు. తల్లిదండ్రులు లేక పోవడం, అవివాహితుడు కావడంతో తన అన్న శేఖర్‌వద్దే ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, పెళ్లి కాకపోవడంతో మనస్థాపంతో మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మంగళవారం కీర్తి వెంచర్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద లభ్యమైన ఆధార్‌కార్డు, ఏటీఎం కార్డుల ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి సోదరుడు శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఇదేమి ఆదర్శం!

- మహేశ్వరం మోడల్ స్కూల్‌లో స్కావెంజర్ల వేతనాల్లలో అవకతవకలు
- అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పథకం దారి మళ్లింపు
- ఆరు నెలల పాటు శ్రమదోపిడీ చేశారని ప్రిన్సిపాల్‌పై ఆరోపణలు



మహేశ్వరం మోడల్ స్కూల్

మహేశ్వరం: ప్రభుత్వ పాఠశాలలో పేదలకు నాణ్యతతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో 2024 ఆగస్టులో రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల పథకం తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారా వచ్చిన నిధులను పాఠశాలల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, మరుగుదొడ్ల శుభ్రత, పాఠశాల పరిసరాల పరిశుభ్రతకు నిధులను వెచ్చిస్తారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, స్థానిక గ్రామ పంచాయతీలోని మహిళా సంఘం అధ్యక్షురాలు, ప్రతీ తరగతి నుంచి ముగ్గురు విద్యార్థుల తల్లులు సభ్యులుగా ఉంటారు.

స్కావెంజర్ల వేతనాల్లో స్కాం!

మహేశ్వరం ప్రభుత్వ మోడల్ స్కూల్‌లోని అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద స్కావెంజర్ల జీతాల కోసం వచ్చే నిధుల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఇక్కడ ప్రిన్సిపాల్ గోపి నిధులను దారి మళ్లిస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ పాఠశాలలో 825 మంది విద్యార్థులున్నారు. వీరి సంఖ్యకు అనుగణంగా 2024 ఆగస్టు నుంచి నెలకు రూ.20 వేల చొప్పున స్కావెంజర్ల జీతాల కోసం ప్రభుత్వం నుంచి విడుదలవుతున్నాయి. ఇద్దరు స్కావెంజర్లను నియమించి వారికి రూ.10 వేల చొప్పున ఇవ్వాల్సి ఉండగా రూ.7 వేల చొప్పున ఇస్తూ రూ.6 వేలు పక్కదారి పట్టిస్తున్నారని స్కావెంజర్లు ఆరోపిస్తున్నారు.

పని మానేసిన స్కావెంజర్లు

మహేశ్వరం మోడల్ స్కూల్ ప్రాంగణం విస్తీర్ణం ఎక్కువగా ఉండడంతో పాటు 825 మంది విద్యార్థులున్నారు. దీంతో మరుగుదొడ్ల శుభ్రత, మొక్కల సంరక్షణ కష్టంగా ఉందని రూ.7 వేలకు పనిచేయలేమని లక్ష్మయ్య, మల్లీశ్వరి మరో ఇద్దరు మహిళలు మానేశారు. ఈ ఏడాది జూలై నుంచి ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా రూ.10వేల చొప్పున వేతనం ఇస్తున్నారు. ఎనిమిది నెలల వేతనం పక్కదారి పట్టించిన సదరు ప్రిన్సిపాల్ గోపిని విచారించి కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

రూ.7 వేలు ఇచ్చారు

మోడల్ స్కూల్‌లో స్కావెంజర్‌గా పని చేశా. నెలకు రూ.10 వేలు ఇస్తామని చెప్పి రూ.7 వేల చొప్పున మూడు నెలలకు రూ.21వేలు చెక్కు ఇచ్చారు. ఇది సరికాదని పూర్తి వేనతం ఇవ్వాలని కోరగా ఇష్టం ఉంటే చేయి లేదంటే మానేయ్ చెప్పడంతో మూడు నెలలు పనిచేసి మానేశా.

– ఏపూరి లక్ష్మయ్య, స్కావెంజర్, మహేశ్వరం మోడల్ స్కూల్

రూ.10 వేలు ఇస్తున్నాం

2024 సెప్టెంబర్ నుంచి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పథకం కింద నిధులు విడుదలవుతున్నాయి. 825 మంది విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నెలకు రూ.20 వేల చొప్పున ప్రతీ మూడు నెలలకొకసారి స్కావెంజర్ల వేతనాల కోసం రూ.60 వేలు విడుదలవుతున్నాయి. మోడల్ స్కూల్‌లో పని చేసే ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులంతా ఏకగ్రీవంగా తీర్మాణం చేసి గత తొమ్మిది నెలల నుండి స్కావెంజర్లకు ఒక్కొక్కరికి నెలకు రూ.7 వేలు, ఇద్దరికి రూ.14 వేలు ఇచ్చాం. రెండు నెలలుగా రూ.10 వేల చొప్పున ఇస్తున్నాం.

– గోపి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, మహేశ్వరం

గోల్‌మాల్ చేస్తే ఉపేక్షించం

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పథకం కింద వచ్చే స్కావెంజర్ల జీతాల నిధులను వారి జీతాలకే ఖర్చు చేయాలి. స్కావెంజర్ల జీతాల కోసం వచ్చే నిధులను వారికే ఖర్చు చేయాలి. పాఠశాల నిర్వాహణ, మౌలిక వసతుల కల్పనకు కంటింజెన్సీ ఫండ్, సమగ్ర శిక్షణ పథకం ద్వారా నిధులు వస్తాయి. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్కావెంజర్లకు వేతనాలు ఇవ్వాలి. నిధులు గోల్‌మాల్ చేస్తే ఉపేక్షించేది లేదు.

– కస్న నాయక్, ఎంఈఓ, మహేశ్వరం

కోడి పందేల స్థావరంపై దాడి

- ఇద్దరు పందెంరాయుళ్లు అరెస్ట్
- మూడు పందెం కోళ్లు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం



పోలీసుల అరెస్ట్ చేసిన పందెంరాయుళ్లు

ఇబ్రహీంపట్నం రూరల్: కోడి పందేలు నిర్వహిస్తున్న స్థావరంపై పోలీసులు దాడి చేసి ఇద్దరు పందెంరాయుళ్లను రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ నోయల్‌రాజ్ తెలిపిన ప్రకారం.. మన్నెగూడ అటవీ ప్రాంతంలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు తమ సిబ్బంది దాడి చేయగా తుర్కయంజాల్‌కు చెందిన తన్నీరు వేణుగోపాల్(32), కట్టంగూర్‌కు చెందిన దాచేపల్లి శేషగిరిరావు(40)ను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల రాకను గుర్తించిన పులువురు అక్కడ నుంచి పరారయ్యారు. వారి వద్ద మూడు పందెం కోళ్లను, రెండు సెల్‌పోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.

ఏఎంసీ చైర్మన్ల ఫోరం అధ్యక్షుడిగా పెంటయ్యగౌడ్



పెంటయ్యగౌడ్‌ను సన్మానిస్తున్న ఏఎంసీ చైర్మన్లు

చేవెళ్ల: వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల ఫోరం ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడిగా చేవెళ్ల ఏఎంసీ చైర్మన్ జి.పెంటయ్యగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నగరంలో నిర్వహించిన సమావేశంలో ఉమ్మడి జిల్లా కమిటీ ఎన్నిక నిర్వహించారని చెప్పారు. చైర్మన్‌గా టి.మల్లేశ్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడిగా కె.వేణుగౌడ్, ప్రధాన కార్యదర్శిగా జి.మాధవరెడ్డి, జాయింట్ సెక్రటరీగా బి.ఆంజనేయులు ఎన్నికయ్యారని చెప్పారు. నూతన కమిటీ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిశామన్నారు.

నకిలీ వైద్యుడి అరెస్టు..

బంజారాహిల్స్: మృతి చెందిన రిజిస్టర్ ఆర్‌ఎంపీ పేరుపై నకిలీ ఆర్‌ఎంపీగా చెలామణి అవుతున్న యువకుడిని జూబ్లీహిల్స్ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే.. యూసుఫ్‌గూడ సమీపంలోని శ్రీకృష్ణానగర్ బి–బ్లాక్‌లో మణికంఠ (32) అనే యువకుడు బీఫార్మసీ పూర్తి చేసి శ్రీసాయి క్లినిక్ పేరుతో క్లినిక్ నిర్వహిస్తున్నాడు. అయితే గతంలో ఈ క్లినిక్‌ను రిజిస్టర్ ఆర్‌ఎంపీగా గుర్తింపు పొందిన వెంకటేశ్వరరావు నడిపేవాడు. ఆరు నెలల క్రితం అతను మృతి చెందాడు. దీనిని అదునుగా తీసుకుని మణికంఠ.. వెంకటేశ్వరరావు పేరుతో ఆర్‌ఎంపీ డాక్టర్‌గా చెలామణి అవుతూ ఈ ఆస్పత్రిని నడిపిస్తున్నాడు. ఇటీవల పలు ఫిర్యాదులు అందడంతో పోలీసులు ఈ క్లినిక్‌పై దాడి చేసి మణికంఠ ధృవపత్రాలను తనిఖీ చేశారు. ఆయన కేవలం బీఫార్మసీ చదివాడని, ఆర్‌ఎంపీగా అనుభవం లేదని, రోగుల బతుకులతో చెలగాటమాడుతున్నాడని గుర్తించాడు. దీంతో అతడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆల్ ఇండియా ప్రిజన్ డ్యూటీ మీట్-2025



జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

బండ్లగూడ: ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో 7వ ఆల్ ఇండియా ప్రిజన్ డ్యూటీ మీట్–2025 అట్టహాసంగా ప్రారంభమైంది. కరక్షనల్ సర్వీస్ చరిత్రలో ఇది చారిత్రాత్మక ఘట్టమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ జైళ్ల శాఖ, కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు చెందిన బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్(బీపీఆర్‌అండ్‌డి) సంయుక్తంగా నిర్వహించారు. దేశంలోని 21 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 1,222 మంది పోటీదారులు, 144 మంది సిబ్బంది పాల్గొంటున్నారు. ప్రొఫెషనల్, క్రీడలు, సాహిత్యం, కళల విభాగాల్లో మొత్తం 36 విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఇది కేవలం పోటీ వేదిక మాత్రమే కాదని.. జైలు సిబ్బందిలో క్రమ శిక్షణ, ప్రతిభ, ఐక్యతకు ప్రతిబింబంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బీపీఆర్‌డీ అదనపు డైరెక్టర్ జనరల్ రవిజోసఫ్ లోక్కు, రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్, హోం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావులతో కలిసి ఆయన పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ అన్ని కన్‌టిజెంట్‌ల మార్చ్‌పాస్ట్ ప్రత్యేక ఆకర్షనగా నిలిచింది. జైళ్ల డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ.. తెలంగాణకు ఈ వేదిక లభించడం గర్వకారణమన్నారు. రవిగుప్తా మాట్లాడుతూ.. డ్యూటీ మీట్ అనేది కేవలం పోటీ కాదని, దేశవ్యాప్తంగా జైలు సిబ్బందిలో స్నేహభావం, జ్ఞాన మార్పిడి, ఆవిష్కరణలకు వేదిక అన్నారు. డీజీపీ జితేందర్ మాట్లాడుతూ.. జైలు సిబ్బంది కనబడని హీరోలని, జైళ్ల శిక్షా గృహాలు కాకుండా పునరావాస, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా మారుతున్నాయన్నారు. ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు జైలు సిబ్బంది నిశ్శబ్ద సేవలను కొనియాడుతూ టెక్నాలజీ ఎగ్జిబిషన్, ప్రిజన్ ప్రొడక్ట్స్ స్టాల్స్‌ను ముందు చూపు చర్యగా అభివర్ణించారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ జైలు సిబ్బందిలోని క్రమ శిక్షణ, అంకితభావం ప్రశంసనీయమని తెలంగాణ జైలు శాఖ ఈ ఈవెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. డ్రోన్లు, రోబోటిక్స్, ఏఐ సిస్టమ్స్, స్కానర్లు, కాంట్రాబాండ్ డిటెక్షన్ టెక్నాలజీలు ప్రదర్శనలో ఉంచారు. ఈ మీట్‌లో వచ్చే మూడు రోజులు పోటీలు, క్రీడలు కళాప్రదర్శనలు, అనుభవాల మార్పిడి జరుగుతాయన్నారు. సెప్టెంబర్ 11న వాలెడిక్టరీ ఫంక్షన్‌తో ముగియనుందన్నారు. ఈ మహోత్సవం సాంప్రదాయం–సాంకేతికత, క్రమ శిక్షణ, కరుణ, పోటీ, స్నేహభావం కలయికగా చరిత్రలో నిలుస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

రూఫ్ దాటితే అంతే..

- కార్ సన్‌రూఫ్‌లలో వేలాడుతూ ప్రయాణాలు
- రోడ్లపై ఓవర్ హెడ్ బారికేడ్లతో పొంచి ఉన్న ప్రమాదం
- వేలాడే కరెంట్, కేబుల్ వైర్లు, మాంజాలతో ప్రాణాలకే ముప్పు
- నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తే జరిమానా తప్పదు
- సోషల్ మీడియాలో రాచకొండ పోలీసుల అవగాహన



సాక్షి, సిటీబ్యూరో: "బెంగళూరులో ఓ బాలుడు కుటుంబంతో కలిసి కారులో ప్రయాణిస్తున్నాడు. సన్‌రూఫ్‌లోంచి తల బయటికి పెట్టి వెళ్తుండగా.. డ్రైవర్ రోడ్డుపై ఉన్న ఓవర్ హెడ్ బారికేడ్‌ను గమనించకుండా అలాగే వాహనాన్ని ముందుకు పోనిచ్చాడు. అంతే అకస్మాత్తుగా బారికేడ్ బాలుడికి తగిలి తల పగిలిపోయింది." అయితే ఈ ఘటన పొరుగు రాష్ట్రంలో జరిగినప్పటికీ.. మనకిదొక హెచ్చరిక! ఈ రోజుల్లో ప్రతి మోడ్రన్ కారుకు సన్‌రూఫ్ తప్పనిసరి అయిపోయింది. పిల్లల నుంచి పెద్దల వరకూ ప్రతి ఒక్కరూ సన్‌రూఫ్ అనుభూతిని పొందాలని భావిస్తున్నారు. అయితే ఆనందం మాటున ప్రమాదం కూడా పొంచి ఉందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. చాలామంది యువతీ యువకులు సన్‌రూఫ్‌లోంచి బయటికి చూస్తూ వికృత చేష్టలకు పాల్పడుతుంటారు. సెల్ఫీలు దిగుతూ, రీల్స్ చేస్తూ వాటిని సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తుంటారు. పిల్లలను తిప్పడం, తిరగడం పేరెంట్స్‌కు ఓ సరదా, స్టేటస్ సింబల్. అయితే ఈ సరదా విషాదం కాకూడదని రాచకొండ ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

సరదా కారాదు విషాదం..

ఇరుకు, బిజీ రోడ్లలో ఎత్తయిన వాహనాలు వెళ్లకుండా పోలీసులు ఓవర్ హెడ్ బారికేడ్లను ఏర్పాటు చేస్తుంటారు. ఇలాంటి రోడ్లలో సన్‌రూఫ్ నుంచి వేలాడుతూ ప్రయాణించకూడదు. విద్యుత్ వైర్లు, టీవీ, ఇంటర్నెట్ కేబుళ్లు, పతంగుల దారాలు, మాంజా, ఇతరత్రా సన్నని తీగలు రోడ్లపై వేలాడుతుంటాయి. ఇది సాధారణంగా డ్రైవర్లకు కనిపించవు. దీంతో సన్‌రూఫ్‌లో ప్రయాణించే వారికి ఇవి తగిలి మెడ, తల, మొండెం భాగాలకు తీవ్ర గాయాలయ్యే ప్రమాదం ఉంది. అలాగే నడుం భాగం వరకూ బయట పెట్టి చేతులను ఊపుతూ ప్రయాణిస్తున్న క్రమంలో డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేస్తే సన్‌రూఫ్‌లో ఉన్నవారికి పట్టు ఉండదు. దీంతో సన్‌రూఫ్ ఫ్రేమ్ తగిలి పక్కటెముకలు, ఊపిరితిత్తులకు గాయాలయ్యే ప్రమాదం ఉంటుంది. పొత్తికడుపులో బలంగా తగిలితే తీవ్ర రక్తస్రావం అయ్యే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. వంకలు, మూల వంపులు అధికంగా ఉన్న రోడ్లలో అయితే ఏకంగా కార్‌లో నుంచి కిందపడిపోయే ప్రమాదం కూడా ఉంటుంది.

సహజ కాంతి కోసమే..

సన్‌రూఫ్ అనేది కేవలం వెంటిలేషన్ కోసమే ఉద్దేశించబడింది. కారు క్యాబిన్ స్పేస్ విశాలంగా అనిపించడంతో అత్యవసర పరిస్థితుల్లో కారు డోర్లు లాక్ అయిపోతే సన్‌రూఫ్ నుంచి బయటికి వెళ్లిపోవచ్చు. అంతేకాకుండా వేసవి కాలంలో ఎండలో కార్ పార్కింగ్ చేసినప్పుడు క్యాబిన్ చాలా వేడెక్కిపోతుంది. ఇలాంటి సమయంలో ఏసీ ఆన్ చేసి, సన్‌రూఫ్‌ను తెరిస్తే కారులోని వేడి గాలి బయటికి వెళ్లి, కార్ క్యాబిన్ త్వరగా చల్లబడుతుంది. ఇరుకైన రహదారులు, బిజీ రోడ్లలో సన్‌రూఫ్‌లను వినియోగించకూడదు. వీటిని హైవేలు, వెడల్పాటి రోడ్లపై మాత్రమే వినియోగించాలి.

జైలు, జరిమానా..

ర్యాష్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్ ఉల్లంఘనల తరహాలోనే బిజీ రోడ్లపై సన్‌రూఫ్ వినియోగాన్ని కూడా తీవ్రమైన నేరంగా పరిగణించాలని ట్రాఫిక్ నిపుణులు సూచిస్తున్నారు. సన్‌రూఫ్‌లతో వ్యక్తిగతంగా ప్రాణాంతకమే కాకుండా రోడ్లపై ఇతర వాహనదారులకు అంతరాయం కలిగిస్తుంది. సన్‌రూఫ్, కారు కిటికీల నుంచి తలను బయటికి వేలాడుతూ ప్రయాణం చేస్తే భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్) సెక్షన్–281 కింద కేసులు నమోదు చేస్తారు. ఈ కేసులలో ఆరు నెలల వరకు జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా లేదా రెండూ విధించవచ్చు. అలాగే ఇతర వాహనాల నుంచి వెలువడే పొగ, దుమ్ము ధూళి నేరుగా ముక్కులోకి వెళ్లి రోగాలకు కారణమవుతాయి.

ఆలోచింపజేసిన రాచకొండ పోస్టు

సన్‌రూఫ్ ప్రయాణం చాలా ప్రమాదం అంటూ రాచకొండ పోలీసులు అవగాహన కోసం సోషల్ మీడియాలో పెట్టిన ఓ పోస్టు అందరినీ ఆలోచింపజేస్తోంది. పిల్లలు, పెద్దలు ఎవరైనా సరే ఆనందం కోసం ఇలా ప్రమాదకరంగా స్టంట్‌లు చేయొద్దంటూ బెంగళూరులో జరిగిన సన్‌రూఫ్ ప్రమాద ఘటన వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీంతో మిలియన్ల సంఖ్యలో ఫాలోవర్లతో ఈ వీడియో హల్‌చల్ చేస్తుంది.

కిడ్నాపర్‌గా భావించి.. చితకబాదారు

గచ్చిబౌలి: చిన్న పిల్లల వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న మహిళను చితకబాది పోలీసులకు అప్పగించిన సంఘటన గచ్చిబౌలి ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన ప్రకారం.. మంగళవారం ఉదయం మసీద్‌బండలోని అనసూయహిల్స్ వద్ద గుర్తు తెలియని మహిళ అనుమానాస్పదంగా తిరుగుతోంది. అక్కడే ఆడుకుంటున్న చిన్నపిల్లల వద్దకు రాగా తల్లిదండ్రులు ఆమె వివరాలు ఆరా తీశారు. ఆమె సమాధానం చెప్పకపోవడంతో కిడ్నాపర్‌గా భావించి చితకబాదారు. డయల్ 100 ఫోన్ చేసి గచ్చిబౌలి పోలీసులకు అప్పగించారు. ఇటీవల కూలీల పిల్లలను టార్గెట్ చేసుకుని చిన్నారులను కిడ్నాప్‌చేసి విక్రయించిన ముఠాను చందానగర్ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. తమ పిల్లలకు వద్దకు వచ్చిన మహిళను ఎక్కడ ఉంటావు, నీ పేరేమిటి అని అడిగిన సరైన సమాధానం ఇవ్వకపోవడంతో స్థానికులు కిడ్నాపర్‌గా భావించి చితక బాది పోలీసులు అప్పగించారు. ఆమెను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించగా తన పేరు పూనమ్ (35) అని, మధ్యప్రదేశ్ అని చెబుతున్నట్లు తెలిపారు. మహిళ పోలీసులు ఆమెను తీసుకెళ్లి సమీప ప్రాంతాల్లో వాకాబు చేసినా ఎక్కడ ఉండేది చూపించ లేదని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆమెను మతిస్థిమితం లేనట్లు భావించి హోంకు తరలించామన్నారు. సదరు మహిళ వద్ద ఎలాంటి గుర్తింపు కార్డు లేదని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మహిళతో పాటు ఎవరైనా వచ్చారా అనే కోణంలో పరిసర ప్రాంతాలలో సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నట్లు తెలిపారు.